క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 3న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కేయూసీ సబ్‌స్టేషన్ పరిధిలోని రేడియో స్టేషన్ ప్రాంతంలో ఉదయం 7.30గంటల నుంచి 9.30గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి



వరంగల్: అకాల మరణం పొందిన కళాకారుల కుటుంబాలను పేద కళాకారులను ఆదుకునేందుకు కళా సంస్థలు కృషి చేయాలని బాలాజీ క్రియేషన్స్ అధినేత ఆడెపు రవీందర్ సూచించారు. హనుమకొండ నేరెళ్ల వేణుమాధవ్ కళాప్రాంగణంలో జేడీ కల్చరల్ ఆర్ట్స్ సొసైటీ వరంగల్ 25వ వార్షికోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వరంగల్‌కు చెందిన ప్రముఖ జానపద గాయకులు శంకర్, సారంగపాణి జ్ఞాపకార్థం శ్రీబాలాజీ క్రియేషన్ అధినేత లయన్ డాక్టర్ ఆడెపు రవీందర్‌కు సినీగేయ రచయిత వరంగల్ వాసి కాసర్ల శ్యామ్ చేతుల మీదుగా కీర్తి పురస్కార్ అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాలాజీ క్రియేషన్ అధినేత రవీందర్ మాట్లాడుతూ అకాల మరణం పొందిన కుటుంబాలను, పేద కళాకారులను, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న కళాకారుల కోసం విరాళాలు సేకరించి చేయూతనందించాలని కోరారు.

పత్తిలో తేమ శాతం పెంచాలని కేంద్ర మంత్రికి లేఖ

వరంగల్: అకాల వర్షాలు, మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సీసీఐ కొనుగోలు చేస్తున్న పత్తిలో తేమ శాతం 15నుంచి 20శాతానికి పెంచాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాసినట్లు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ మోర్తాల చందర్ రావు ఒక ప్రటనలో తెలిపారు. సీసీఐ 8నుంచి 12శాతం తేమ ఉంటేనే కొనుగోలు చేస్తామని చెప్పడం వల్ల రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. దీనికి తోడు పత్తి పంట దిగుబడులు తగ్గడంతో రైతులకు పెట్టుబడి వచ్చేది కూడా అనుమానంగా ఉందని తెలిపారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని తేమ శాతం పెంచి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మెస్ చార్జీల పెంపుపై హర్షం



కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని హాస్టళ్లు, గురుకులాలు, ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు డైట్ చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు, మెస్ చార్జీలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంపై తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలో లైబ్రరీ వద్ద సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శనివారం పూలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నిరుద్యోగ జేఏసీ చైర్మన్ మేడారపు సుధాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లపెల్లి నరేష్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏడేళ్లుగా విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కేయూ విద్యార్థి నిరుద్యోగ జేఏసీ ఇన్‌చార్జ్ పడిగెల అభిరామ్, అధ్యక్షుడు గుండేటి సుమన్, నాయకులు కిరణ్, సోని, రజిత, అశ్విని, అనిల్, షరీఫ్, శ్రీకాంత్, మురళి, నవీన్‌నాయక్, అరుణ్‌కుమార్, సాయి వికాస్, చందర్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్ మేనేజర్‌కు సన్మానం

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన అగ్గి రవీందర్‌ను రైల్వే స్టేషన్ మేనేజర్ కార్యాలయంలో రైల్వే డ్రైవర్ల కార్యాలయం క్రూ కంట్రోలర్ మినిస్టరల్ సిబ్బంది శనివారం మర్యాదపూర్వంగా కలిశారు. ఈమేరకు ఆయనను కార్యాలయ సూపరింటెండెంట్లు వస్కుల రవీందర్, లక్ష్మణ్‌రావు, తదితరులు సన్మానించారు.

ఘనంగా సమాధుల పండుగ



హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం వంగపహాడ్‌లో శనివారం సమాధుల పండుగను ఘనంగా నిర్వహించారు. పునీత్ ఆంథోని చర్చి ఆధ్వర్యంలో సమాధుల వద్ద క్రిస్టియన్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఐదు టిప్పర్ల పట్టివేత

ఐనవోలు : అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న ఐదు టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పంథిని గ్రామంలో ఐదు టిప్పర్ల ద్వారా అక్రమంగా మొరం తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. టిప్పర్ యజమానులు, డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

రెండుసార్లు వాయిదా

- ఇంకా ప్రారంభం కాని ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ఇప్పటికే గ్రామాల్లోకి దళారులు?
- మడిపల్లి కేంద్రంపై వివాదం
- ఆందోళనలో అన్నదాతలు



విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ధాన్యం

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇప్పటి వరకు ఇంకా ప్రారంభం కాలేదు. 15 రోజుల క్రితమే ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి ముహూర్తం నిర్ణయించారు. ఆయా గ్రామాల్లో అన్ని ఏర్పాట్లు కూడా చేశారు. స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును ఆహ్వానించారు. అంతలోనే ఆకస్మాత్తుగా ప్రారంభోత్సవం వాయిదా పడింది. జయగిరి, అన్నాసాగరం, నాగారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభోత్సవానికి శుక్రవారం మళ్లీ ఏర్పాట్లు చేశారు. పండుగ కారణంగా మళ్లీ కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమం వాయిదా పడింది. రెండు రోజుల తర్వాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని ప్రజాప్రతినిధులు సమయం ఇచ్చారు. అయితే మళ్లీ ప్రారంభిస్తారా? వాయిదా వేస్తారా అనేది ప్రశ్న వ్యక్తమవుతోంది. ఇప్పటికే కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పేరుకపోయాయి. వర్షం వస్తే ధాన్యం ముద్దవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పలిన్ కవర్లు కప్పారు.

కొనుగోళ్లు చేపట్టిన దళారులు

కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో గ్రామాల్లోకి దళారులు వచ్చారు. ప్రభుత్వం రూ.2320కు ధాన్యం కొనుగోలు చేయడానికి నిర్ణయించగా, దళారులు రూ.2300లకే ఖరీదు చేస్తున్నారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్ల చేస్తున్నారు.

మడిపల్లిలో కొనుగోలు కేంద్రంపై వివాదం

మడిపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రంపై వివాదం నెలకొంది. గతంలో ఇక్కడ ఇందిరా క్రాంతిపథం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం నిర్వహించే వారు. అయితే ఇటీవల కాలంలో ఈ కేంద్ర నిర్వహణపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందింది. దాంతో ఈ కేంద్రాన్ని పీఏసీఎస్‌కు కేటాయించారు. తిరిగి ఆ కేంద్రాన్ని ఐకేపీకి కేటాయించడంపై పీఏసీస్ సభ్యుల నుంచి తీవ్ర వ్యతిరేక వస్తోంది.

వైభవంగా కార్తీకమాస పూజలు ప్రారంభం



మెట్టుగుట్టపై ఆకాశదీపం వెలిగిస్తున్న అర్చకులు



శ్వేతార్కలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

మడికొండ: 46వ డివిజన్ మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఉదయం సంప్రోక్షణ అనంతరం స్వామివారికి ప్రభాతసేవతో వైభవంగా గోపూజ, అఖండ దీపారాదన, ప్రాతఃకాల మహన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా భక్తులు అర్చనలు, అభిషేకాలు చేశారు. రామాలయంలో స్వామివారికి విశేష అర్చనలు జరిపించారు. సాయంకాలం సంధ్యాసమయంలో హరిహరులకు వైభవంగా ఆకాశ దీపోత్సవం శివాలయంలో ప్రదోషకాల రుద్రాభిషేకం, నీరాజన మంత్రపుష్పం, నక్షత్ర హారతి, చతుర్వేద స్వస్తి, రాజోపచార పూజలు, పవళింపు సేవ నిర్వహించారు. కార్తీక మాసం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణధికారి శేషుభారతి తెలిపారు. కార్యక్రమంలో చైర్మన్ పైడిపాల రఘుచందర్, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, విష్ణువర్ధనాచార్యులు, పారుపల్లి సత్యనారాయణ శర్మ, దేవేందర్‌శర్మ, మణివర్మ, ధర్మకర్తలు రొడ్డ దయాకర్, బైరి రాజుగౌడ్, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, జ్ఞానేశ్వరి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

కాజీపేట శ్వేతార్క ఆలయంలో..

కాజీపేట పట్టణంలోని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో కార్తీక మాసోత్సవ వేడుకలను ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయిన ఐవోలు వెంకటేశ్వర్లు శర్మ శనివారం ప్రారంభించారు. దీపావళి ఉత్సవాలను పురస్కరించుకుని సంతాన లింగేశ్వర స్వామివారికి అర్చకులు తులసి పూజ, ఈశ్వరాభిషేకం, సహస్ర బిల్వదళ పూజలు చేశారు. కార్తీక మాస విశిష్టతపై భక్తులకు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు రాధాకృష్ణ శర్మ అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం దేవాలయంలోని అన్నపూర్ణ కేంద్రంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు సాయికృష్ణ శర్మ, ఆలయ మేనేజర్ ఎల్.రవి, పీఆర్వో మణిదీప్, దేవులపల్లి సదానందం, శనిగరపు రాజ్‌మోహన్, సీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

కళాఉత్సవ్ పోటీల్లో ప్రతిభ



విద్యారణ్యపురి: రాష్ట్రస్థాయి కళాఉత్సవ్ పోటీల్లో హనుమకొండ జిల్లా నుంచి పాల్గొని ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులకు హనుమకొండలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రావీణ్య శనివారం అభినందించారు. కూచిపూడి పోటీల్లో ప్రతిభ చూపి ప్రథమ స్థానం సాధించి జాతీయ స్థాయి కూచిపూడి పోటీలకు ఎంపికైన సెయింట్ పీటర్స్ హైస్కూల్ విద్యార్థి యజ్ఞశ్రీని, గాత్రం పోటీల్లో రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో నిలిచిన సెయింట్ గాబ్రియల్ హైస్కూల్ విద్యార్థి దివ్యవెంకటరామన్‌ను కలెక్టర్ అభినందించారు. హనుమకొండ డీఈఓ వాసంతి, జిల్లా క్వాలిటీ కోఆర్డినేటర్ శ్రీనివాస్, విద్యార్థుల తల్లిదండ్రులు, గైడ్‌టీచర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ జట్టులో ప్రభుత్వ మర్కజీ విద్యార్థి



విద్యారణ్యపురి: 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 5, 6వ తేదీల్లో సంగారెడ్డిలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు హనుమకొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ విద్యార్థి అరవిందరాజ్ ఎంపియ్యాడు. ఈమేరకు ఆ విద్యార్థిని హైస్కూల్ హెడ్‌మాస్టర్ రామారావు, వ్యాయామ ఉపాధ్యాయుడు మనోహర్, ఉపాధ్యాయులు అభినందించారు.

మీ సేవలు స్ఫూర్తిదాయకం



హసన్‌పర్తి: ఎన్నో త్యాగాలు, కష్టాలను అధిగమించి విజయవంతంగా విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందుతున్న ఉద్యోగుల సేవలు నేటితరం పోలీసులకు స్ఫూర్తిదాయకమని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా ప్రశంసించారు. పోలీస్ శాఖలోని వివిధ విభాగాల్లో దీర్ఘకాలంపాటు పనిచేసి పదవీ విరమణ పొందిన ఆర్ఎస్సై అబ్దుల్ ఖయ్యుం, ఎస్సై గణపతి, ఏఎస్సైలు సాంబయ్య, రుషేంద్రమణి, నర్సింహులు, హెడ్ కానిస్టేబుల్ రాజేంద్రప్రసాద్‌ను శనివారం సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. పోలీస్ కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీ, ఆర్ఐలు సతీష్, స్వర్ణన్‌రాజ్, శ్రీధర్, ఆర్ఎస్సై సాయికిరణ్ పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

మామునూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి చింతమల్ల రంగయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యురాలు నలిగంటి రత్నమాల డిమాండ్ చేశారు. వరంగల్ తిమ్మాపురం లక్ష్మీపురంలోని ఏచూరి ప్రాంగణంలో తోట మల్లయ్య అధ్యక్షతన సీపీఎం శాఖల మహాసభ శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం మత విద్వేషాలను రెచ్చగొడుతూ పాలన కొనసాగిస్తోందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌పరం చేస్తూ దేశంలో నిరుద్యోగ సమస్యను పెంచి పోషిస్తోందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ, నియంతృత్వ పాలన సాగించాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ధ్వజమెత్తారు. ఉదయశ్రీ, రాజు, స్వాతి, కృష్ణ, మల్లయ్య, ఎండీ.రజియా, మంజుల, ప్రకాష్, ఎండీ.షమీనా పాల్గొన్నారు.

నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించండి



జక్కులొద్ది మైనార్టీ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న చావ రవి

కాశీబుగ్గ సెంటర్ / ఖిలా వరంగల్ : ఉపాధ్యాయుల పక్షపాతి అలుగుబెల్లి నర్సిరెడ్డి అని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి అన్నారు. వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఓటర్లు నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఉపాధ్యాయ నియోజకవర్గ ఉపాధ్యాయ ఓటరు నమోదు కార్యక్రమంలో భాగంగా వరంగల్ జక్కులొద్దిలోని తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల, నర్సంపేట వల్లభ్‌నగర్ రెసిడెన్షియల్ స్కూల్, జెడ్పీహెచ్ఎస్, మోడల్ స్కూల్, ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్ సైనిక్‌స్కూల్, కేజీబీవీ పాఠశాల, వరంగల్ ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల, ధర్మారం జెడ్పీ ఉన్నత పాఠశాలలను శనివారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులతో మాట్లాడారు. అర్హత గల ఉపాధ్యాయులందరూ నవంబర్ 6వ తేదీ లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయ సమస్యలతోపాటు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేయగల వ్యక్తి నర్సిరెడ్డి అని చావ రవి పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి సుజన్ ప్రసాదరావు, కోశాధికారి రవూఫ్, నామోజు శ్రీనివాస్, మల్సూర్, తదితరులు పాల్గొన్నారు.

విప్లవకారుల ప్రాణ త్యాగాలు వెలకట్టలేనివి



నినాదాలు చేస్తున్న పార్టీ నాయకులు

ఖిలా వరంగల్: భూమి, భుక్తి, విముక్తి కోసం కొనసాగిన భారత విప్లవ ఉద్యమంలో తమ అమూల్యమైన ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన విప్లవకారుల త్యాగాలు వెలకట్టలేనివని, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా కార్యదర్శి చిర్ర సూరి కొనియాడారు. ప్రజలంతా శ్రామిక రాజ్యస్థాపననే ధ్యేయంగా విప్లవోద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా వరంగల్ శివనగర్‌లో శనివారం ఎర్రజెండాలు ఎగురవేసి అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై జెండా ఆవిష్కరించి మాట్లాడుతూ దేశంలో 78ఏళ్ల పార్లమెంటరీ పాలనలో ప్రభుత్వాలు ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నేత మైదం పాణి, అర్షం అశోక్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరసింహారావు, అంకూష్, స్వామి, సాంబయ్య, మురళి, అమర్, లక్ష్మి, చంటి, ప్రభాకర్, వెంకన్న, మధు, తదితరులు పాల్గొన్నారు.

రేపు మాదిగ ఆత్మీయ సమ్మేళనం



హసన్‌పర్తి: మాట్లాడుతున్న పుట్ట రవిమాదిగ

హసన్‌పర్తి: ఈనెల 4న చింతగట్టు క్యాంపు సమీపంలోని కేఎల్ఎన్ గార్డెన్‌లో మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఎంఎస్పీ జాతీయ నాయకుడు పుట్ట రవిమాదిగ తెలిపారు. 55వ డివిజన్ భీమారంలో మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తానని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూలమైన తీర్పు ఇచ్చినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంభిస్తోందని ఆరోపించారు. కమిటీల పేరిట రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. ఎంఎస్పీ నాయకుడు సంగాల విక్టర్ బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంఎస్పీ నాయకులు మేకల రమేష్, బోడ యుగంధర్, రాజారపు భిక్షపతి, పుల్లా నరేష్, తాళ్ల రమేష్, కోటేశ్వర్, రేనుకుంట్ల సురేష్, సంగాల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమ్మేళన సభను విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్: హనుమకొండలోని చింతగట్టులోని కేఎల్ఎన్ గార్డెన్‌లో ఈనెల 4న జరగనున్న మాదిగ ఆత్మీయ సమ్మేళన సభను విజయవంతం చేయాలని కేయూ మాదిగ విద్యార్థుల వేదిక నాయకుడు డాక్టర్ మంద వీరస్వామి కోరారు. కాకతీయ యూనివర్సిటీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణకు సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇచ్చినప్పటికీ అమలు చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆరోపించారు. సమావేశంలో మాదిగ విద్యార్థుల వేదిక కేయూ నాయకులు డాక్టర్ పాలమాకుల కొమురయ్య, అలువాల కార్తీక్, కుమారస్వామి, అరూరి రంజిత్, ఓడపెల్లి మధు, బొట్ల మనోహర్, అంబాల కిరణ్, కేతపాక ప్రసాద్, మాసాని ప్రదీప్, దుపాకి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మటన్ షాపు నిర్వాహకుడికి జరిమానా



వరంగల్: నిబంధనలకు విరుద్ధంగా నగర పరిధిలో శనివారం మాంసం విక్రయించినందుకు నర్సంపేట రోడ్డులోని ఏ - 1 మటన్ షాపు నిర్వాహకుడికి జరిమానా విధించినట్లు బల్దియా ముఖ్య ఆరోగ్యాధికారి డాక్టర్ రాజారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగర పరిధిలో మటన్ షాపులు శనివారం రోజు తెరవొద్దని అన్నారు. ఈమేరకు శానిటరీ సూపర్‌వైజర్ పి.భాస్కర్ ఆధ్వర్యంలో నగర పరిధిలో తనిఖీలు నిర్వహించగా ఏ-1 మటన్ షాపు నిర్వాహకుడు నిబంధనలకు విరుద్ధంగా మాంసం విక్రయిస్తున్నట్లు గుర్తించి సదరు యజమానికి రూ.3వేల జరిమానా విధించినట్లు వివరించారు. మాంసం దుకాణదారులు విధిగా నిబంధనలు పాటించాలని, ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని రాజారెడ్డి హెచ్చరించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోల్కొండ శ్రీను, జవాన్లు నాగరాజు, సాంబయ్య పాల్గొన్నారు.

బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులకు స్వాగతం



నిరంజన్, సభ్యులతో ఎమ్మెల్యే, నాయకులు



చైర్మన్‌తో మాట్లాడుతున్న నాయకులు

హన్మకొండ: స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామాషా మేరకు రిజర్వేషన్ల అమలుకు చేపట్టిన బహిరంగ విచారణలో పాల్గొనేందుకు హనుమకొండ కలెక్టరేట్‌కు వచ్చిన తెలంగాణ వెనుకబడిన తరగతుల కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మికి హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య, వరంగల్ కలెక్టర్ సత్యశారద, జనగామ జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా, ములుగు కలెక్టర్ దివాకర పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో..

హనుమకొండకు వచ్చిన తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు సన్మానించారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మిని ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్.నాగరాజు, కాంగ్రెస్ పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారిని సన్మానించారు. పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ రావు, ఈవీ శ్రీనివాస్‌రావు, అనిల్, అశోక్ రెడ్డి, సయ్యద్ విజయశ్రీ రజాలీ, బంక సరళ, బంక సంపత్, అంబేద్కర్ రాజు పాల్గొన్నారు.

వెనుకబడి ఉన్నాం.. ప్రాధాన్యం కల్పించండి

న్యూశాయంపేట: ముస్లింలు మిగతా వర్గాల కంటే సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ రంగాల్లో వెనుకబడి ఉన్నారని, ఈక్రమంలో తగిన ప్రాధాన్యం కల్పించాలని మైనారిటీ సంఘాల నాయకులు కోరారు. ఈమేరకు బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్, సభ్యులు బాలలక్ష్మి, రాపోలు జయప్రకాశ్, తిరుమలగిరి సురేందర్‌కు విజ్ఞప్తి చేశారు. స్థానిక సంస్థల వారీగా కల్పించాలిన రిజర్వేషన్ల దామాషాను ఖరారు చేసే అంశంపై హనుమకొండ కలెక్టరేట్‌లో నిర్వహించిన బహిరంగ విచారణలో కమిషన్‌కు నాయకులు వినతి పత్రాలు అందజేశారు. బీఆర్ఎస్ మైనారిటీ వింగ్ నాయకులు సయ్యద్ మసూద్, మహ్మద్ షఫీ, అబ్దుల్ ఖుద్దూస్, మహమూద్, షకీల్, మిల్లత్ రాబ్తా కమిటీ సభ్యుడు, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, ముదస్సర్, ఎజాజ్ అహ్మద్, ముఫ్తీ మినాజ్, అజరుద్దీన్, ముజాహిద్, సమీనుల్లా, బషీరుద్దీన్, ఎంఐఎం వరంగల్ జిల్లా అధ్యక్షుడు సుభాన్, ఇంటలెక్చువల్ ఫోరం సభ్యులు డాక్టర్ అనీస్ సిద్దిఖీ, సయ్యద్ అక్బర్, డాక్టర్ రాజ్‌మహ్మద్, నయీం పాల్గొన్నారు.

వ్యాపారులు సకాలంలో ఫీజులు చెల్లించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న కార్యదర్శి నిర్మల

వరంగల్: వరంగల్ లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ టమాట-పండ్ల వ్యాపారులు సకాలంలో అద్దె కిరాయిలు, మార్కెట్ ఫీజులను బకాయిలు లేకుండా చెల్లించాలని మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల కోరారు. మార్కెట్ ప్రధాన కార్యాలయంలోని టమాట వ్యాపారులతో శనివారం సమావేశమయ్యారు. ఈసందర్భంగా పండ్ల వ్యాపారులు మార్కెట్‌లోని సమస్యలను కార్యదర్శికి వివరించారు. కూరగాయల మార్కెట్‌లో ఆవులు, మేకలు సంచరించడం వలన వినియోగదారులు, వ్యాపారస్తులు ఇబ్బందులు పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరారు. మార్కెట్‌లో ఖరీదు వ్యాపారులకు, వినియోగదారుల వాహనాలకు సరిపడా పార్కింగ్ స్థలం కేటాయించామని కార్యదర్శి తెలిపారు. సమావేశంలో కార్యదర్శి గ్రేడ్-2 ఎస్.రాము, సహాయ కార్యదర్శి రాజేందర్, పర్యవేక్షకుడు మురళియాదవ్, కూరగాయల మార్కెట్ వర్తక సంఘం అధ్యక్షుడు జారతి శ్రీనివాస్, టమాట మార్కెట్ వ్యాపారస్తులు మజీద్ అహ్మద్ బాబా, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

కెపాసిటర్ల బిగింపుతో కరెంట్ ఆదా



పొలంబాట కార్యక్రమంలో డీఈఈ, రైతులు

హసన్‌పర్తి: కెపాసిటర్లు బిగించుకుంటే విద్యుత్‌ను ఆదా చేసుకోవచ్చని డీఈఈ సామ్యానాయక్ అన్నారు. విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో హసన్‌పర్తి ఎల్లాపురంలో పొలం బాట కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యుత్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించారు. ఓవర్ లోడ్ డీటీఆర్ కోసం అదనంగా డీటీఆర్‌లు బిగించుకోవాలని సూచించారు. సమస్యలు ఉంటే స్థానిక విద్యుత్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలన్నారు. స్వతహాగా విద్యుత్ స్తంభాలు ఎక్కి ప్రమాదాలకు గురికావొద్దని హెచ్చరించారు. లూజ్‌లైన్స్ కోసం మీడిల్ పోల్స్ ఏర్పాటు చేసుకోవాలని రైతులకు చెప్పారు. కార్యక్రమంలో ఏడీ అశోక్, ఏఈ మౌనిక, సబ్ ఇంజనీర్ స్వామి, సీనియర్ లైన్ ఇన్‌స్పెక్టర్ రామ్మోహన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు హన్మంతు, రవీందర్, లైన్‌మెన్ రాజేందర్, రాజమౌళి, కుమారస్వామి, సిబ్బంది శ్రీనివాస్, మహ్మద్ వాజీద్, పోతరాజు రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

హన్మకొండ: ఈనెల 7న హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో జరగనున్న జాతీయ సెమినార్‌ను జయప్రదం చేయాలని ఎంసీపీఐ(యూ) హనుమకొండ జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసరెడ్డి పిలుపునిచ్చారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద జాతీయ సెమినార్ వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులు శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎన్‌రెడ్డి హంసరెడ్డి మాట్లాడుతూ మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా - యూ (ఎంసీపీఐ - యూ), రివల్యూషనరీ మార్క్సిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్ఎంపీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటైన కమ్యూనిస్టు కోఆర్డినేషన్ కమిటీ సమావేశాలు ఈ నెల 5, 6, 7వ తేదీల్లో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్‌లో జరగనున్న సందర్భంగా 7న సుందరయ్య భవన్‌లో ప్రస్తుత రాజకీయాలు - మతోన్మాద కార్పొరేట్ శక్తుల ప్రమాదం - వామపక్ష కమ్యూనిస్టు శక్తుల కర్తవ్యం అనే అంశంపై జాతీయ సెమినార్ నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో ఎంసీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గడ్డం నాగార్జున, మాస్ సావిత్రి, జిల్లా కమిటీ సభ్యులు మొగిలి శ్రీనివాసరావు, కూతురు ఇంద్రారెడ్డి, నాయకులు మట్టెడ మొగిలి, బైరపాక భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యం మేరకు పనిచేయాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సాంబశివరావు

గీసుకొండ: వరంగల్ జిల్లాలో వైద్యాధికారులు, సిబ్బంది ప్రభుత్వం నిర్ణయించిన ఆరోగ్య లక్ష్యాలను అధిగమించడానికి కృషి చేయాలని డీఎంహెచ్ఓ సాంబశివరావు కోరారు. జిల్లాలోని వైద్యాధికారులు, సిబ్బందితో శనివారం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల బదిలీ అయిన డీఎంహెచ్ఓగా పనిచేసిన డాక్టర్ వెంకటరమణ, డిప్యూటీ డీఎంహెచ్ఓగా పనిచేసిన డాక్టర్ గోపాల్‌రావులు అందించిన సేవలను కొనియాడారు. డిప్యూటీ డెమో అనిల్‌కుమార్, సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.